సాక్షి నిజామాబాద్

గురువారం । 11 । జనవరి । 2024



వేతనం మరిచారు..

సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు అందడం లేదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- 10లో ▸



పూర్తి భత్యం చెల్లించాలి

అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన తమకు పూర్తి భత్యం చెల్లించాలని వీడియో గ్రాఫర్లు కోరుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.7 /20.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

- డీఆర్‌డీవో చందర్‌నాయక్



డిచ్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'ఆర్థిక అక్షరాస్యత శిక్షణ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత శిక్షణలో ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్, ఇతర ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై ఆరు రోజుల శిక్షణ ఇస్తారని తెలిపారు. తరగతుల్లో నేర్చుకునే ప్రతి అంశాన్ని మీ గ్రామాల్లో ఉండే మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఈటీఐలో చాలా రకాల స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు ఉంటాయని, ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఈటీఐ ఇచ్చే శిక్షణను ఉపయోగించుకుని జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సెర్ప్ ప్రతినిధి వెంకటేశ్, డీపీఎం రవీందర్, ఆల్‌ఇండియా రేడియో ప్రతినిధి వరలక్ష్మి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీల అవిశ్వాస సమావేశాలు రద్దు

డిచ్‌పల్లి : జిల్లాలోని డిచ్‌పల్లి, మోపాల్, హోన్నాజీపేట్ సహకార సంఘాల (సొసైటీ) చైర్మన్లపై ఆయా డైరక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి తేదీని నిర్ణయిస్తూ ఇచ్చిన నోటీసులను డీసీవో సింహాచలం రద్దు చేశారు. డీసీవో తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల డిచ్‌పల్లి, మోపాల్, హోన్నాజీపేట్ సొసైటీ చైర్మన్లపై డైరక్టర్లు అవిశ్వాస తీర్మానం కోసం డీసీవో కు లేఖలు అందజేశారు. ఆయా సొసైటీల్లో అవిశ్వాస తీర్మాన సమావేశాలు నిర్వహించేందుకు డీసీవో తేదీలు ఖరారు చేస్తూ డైరక్టర్లందరికీ నోటీసులు పంపించారు. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు నోటీసు ఇచ్చే అధికారం జిల్లా సహకార అధికారి (డీసీవో) పరిధిలో లేనందున ఆ నోటీసులను వెనక్కు తీసుకుని సమావేశాల తేదీలను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. తేదీలు ఖరారు చేసే అధికారం రాష్ట్ర సహకార ఉన్నతాధికారులకు ఉంటుందని తెలిపారు. ఆయా సొసైటీ ల డైరక్టర్లు ఈ విషయమై మంగళవారం హైదరాబాద్ కు వెళ్లి రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ ను కలిసినట్లు తెలిసింది. త్వరలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి తేదీని నిర్ణయిస్తూ నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

'ప్రతి ఇంటా భగవద్గీత ఉండాల్సిందే'

సదాశివనగర్: ప్రతి ఇంటా భగవద్గీత ఉండాల్సిందేనని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్, అఖిల భారత కళా మండలి ప్రముఖ్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం లింగంపల్లిలోని శ్రీకృష్ణ మందిరం ఆధ్వర్యంలో విశ్వశాంతి గీతాజ్ఞాన యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు గీతోపదేశం ఎంతో దోహదపడుతోందన్నారు. ప్రపంచ దేశాలు భారతీయ సంస్కృతిని ఆదర్శంగా తీసుకొని జీవన విధానంలో మార్పులు చేసుకుంటున్నాయన్నారు. భగవద్గీతను అనుసరించి జీవనం కొనసాగించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు.

సంతానం పేరిట వ్యాపారం!



నందిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన సావిత్రి, రాజు(పేరుమార్చాం) దంపతులకు ఆలస్యంగా పెళ్లయ్యింది. నాలుగేళ్లు గడిచినా సంతానం కలగలేదు. దీంతో జిల్లా కేంద్రంలోని ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రానికి వెళ్లారు. ప్రముఖ వైద్యురాలు పరీక్షించి స్కానింగ్‌లు చేయించి మందులు వాడాలని సూచించారు. ఫలితం లేకపోవడంతో ఐయూఐ, అటు తర్వాత ఐవీఎఫ్ చేసినా సంతానం కలగలేదు. ఇందుకోసం సుమారు రూ. 3లక్షలతో పాటు అదనంగా మందుల కోసం రూ. లక్షా 50వేలు ఖర్చయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఇలా చాలామంది దంపతులు పిల్లల కోసం అప్పులు చేసి చికిత్స చేయించుకున్నా పిల్లలు పుట్టకపోవడంతో చివరకు దత్తత తీసుకుంటున్నారు.

- జిల్లాలో జోరుగా 'ఇన్‌ఫెర్టిలిటీ' దందా
- చికిత్స పేరిట రూ. లక్షల్లో వసూలు
- సక్సెస్ రేటు రెండు శాతమే..!
- అనుమతి లేని కేంద్రాలే అధికం
- అధికారుల పర్యవేక్షణ అంతంతే..

నిజామాబాద్‌నాగారం : పిల్లలు పుట్టక ఆవేదన చెందుతూ.. సంతానం కోసం పరితపిస్తున్న దంపతుల అవసరాన్ని అవకాశంగా మలుచుకుని జిల్లాలో 'ఇన్‌ఫెర్టిలిటీ' దందాను జోరుగా నిర్వహిస్తున్నారు. సంతానం కోసం ఆస్పత్రికి వచ్చిన దంపతుల నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. మొదట మూడు నుంచి ఆరు నెలల పాటు ట్రీట్‌మెంట్ తీసుకోవాలని సూచిస్తారు.. అటు తర్వాత ఏడాది కోర్సు అని.. ఇంకా పిల్లలు పుట్టకపోతే రెండు నుంచి మూడేళ్ల కోర్సు అంటూ నమ్మబలుకుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు. అయినా ఫలితం లేకపోతే ఐయూఐ, ఐవీఎఫ్ పేరిట రూ. లక్షలు గుంజుతున్నారు. చివరకు సంతానం కలగకపోవడంతో మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లాలని సూచిస్తున్నారు. వీటి సక్సెస్ రేటు 20శాతం ఉంటుందని వైద్యులు చెబుతున్నా.. వాస్తవానికి కేవలం రెండు శాతం మాత్రమే ఉంటుందని సమాచారం. ఒకవైపు ఈ తతంగమంతా అనుమతి ఉన్న కేంద్రాల్లో సాగుతుండగా.. మరోవైపు అనుమతి లేకుండా జిల్లాలో చాలా కేంద్రాలు కొనసాగుతున్నాయి.

అనుమతి లేకున్నా వైద్యం

యాంత్రిక జీవనంలో పెళ్లిళ్లు ఆలస్యంగా చేసుకోవడంతో పాటు దంపతుల్లో సమస్యలు ఉండడంతో కొందరికి సంతానం కలగడంలేదు. పిల్లలు పుట్టడం లేదనే ఆందోళనతో ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో నాలుగైదేళ్లుగా వీటికి డిమాండ్ పెరిగింది. దీంతో జిల్లాలో సంతాన సాఫల్య కేంద్రాలు పదుల సంఖ్యలో వెలిశాయి. వీటిలో అనుమతి పొందిన కేంద్రాలు కేవలం ఆరు మాత్రమే ఉన్నాయి. అనధికారికంగా చాలా ప్రైవేటు ఆస్పత్రుల్లో సంతానం కోసం చికిత్సలు అందిస్తున్నారు. కొందరు గైనకాలజిస్టులు అనుమతి లేకుండానే వైద్యం చేస్తున్నారు. పల్లెల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు సైతం ఫలానా ఇన్‌ఫర్టిలిటీ కేంద్రానికి వెళ్తే పిల్లలు పుడతారంటూ చెప్పి మరీ పంపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందులో కూడా కమీషన్లు ఉండడం గమనార్హం. ఏదేమైనా రూ. లక్షలు ఖర్చు చేసి నెలలు, సంవత్సరాల పాటు చికిత్స పొందినా ఫలితం ఉండకపోవడంతో చాలా మంది మనోవేదనకు గురవుతున్నారు.

పర్యవేక్షణ కరువు

జిల్లాలో ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాల పేరిట యథేచ్ఛగా దోపిడీ జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లాలో కేవలం ఆరు కేంద్రాలకు మాత్రమే అనుమతి ఉంది. వీటి ఏ విధమైన చికిత్స అందిస్తున్నారో సంబంధిత అధికారులు తూతూమాత్రంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రీట్‌మెంట్, ఫీజుల విషయంలో సైతం పట్టించుకోవడం లేదు. కేంద్రాల నుంచి కూడా 'మామూళ్లు' ముడుతుండడంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యవేక్షణ చేయిస్తాం

జిల్లాలో అనుమతి పొందిన ఫెర్టిలిటీ కేంద్రాలు ఆరు మాత్రమే ఉన్నాయి. ఇందులో కచ్చితంగా ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఏవో గంగాధర్‌ను పర్యవేక్షణ చేయాలని ఆదేశించాం. తేడాలు ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో

ఫిర్యాదులు వస్తే చర్యలు

ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాల్లో సంతానం కోసం చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఏమైనా తేడా జరిగినట్లు తెలిస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తాం. ఇప్పటి వరకు నాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. సంతాన సాఫల్య కేంద్రాల చికిత్స విధానంలో సక్సెస్ రేటు ఎంత అనే విషయం నాకు తెలియదు. – గంగాధర్, ఇన్‌చార్జి ఏవో

త్వరలో రైతు రుణమాఫీ!

- ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా నిధుల సమీకరణ
- కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- రూ. 2లక్షల వరకు మాఫీ చేసే అవకాశం
- జిల్లాలో దాదాపు లక్షమందికి పైగా రైతులకు చేకూరనున్న లబ్ధి



డొంకేశ్వర్/మోర్తాడ్: రైతు రుణమాఫీ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనతో జిల్లా రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని ఆశతో ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ చాలామంది రైతులకు నిరాశను కలిగించగా, కొత్త ప్రభుత్వం సంతృప్తికరంగా రుణమాఫీ చేస్తుందో లేదోనని ఎదురుచూస్తున్నారు. అయితే, కటాఫ్ తేదీని ఎంత వరకు తీసుకుంటారు? మార్గదర్శకాలు ఎలా ఉండనున్నాయి? అనే దానిపై రైతులు ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో 2.80లక్షల వరకు రైతులు ఉన్నారు. భూముల్లో పంటలు సాగు చేసినా, చేయకపోయినా ప్రతి యేటా బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వాలు రుణమాఫీ చేస్తుండడంతో కొంతమంది వడ్డీ కడుతూ అసలు అప్పును అలాగే ఉంచుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 2,12,361 మంది రైతులు రూ. 895.76కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్నవారున్నారు. ఇందులో రూ. 30వేల నుంచి మొదలుకొని రూ. 5లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు 97,418 మంది రైతులకు రూ. 490.72కోట్ల రుణమాఫీ చేసింది. అయితే, లక్ష లోపు రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ జరగలేదు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తించింది. కొన్ని ప్రాంతాల్లో ఆ ఒక్కరికి కూడా మాఫీ జరగలేదు. దీంతో రైతులు గత ప్రభుత్వ తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. అలాగే 7,384మంది రైతులకు బ్యాంకు ఖాతాలు క్లోజ్ కావడంతో రూ. 43.60 కోట్ల రుణమాఫీ డబ్బులు వేరే ఖాతాల్లో జమ చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

లెక్కలు తీస్తున్న అధికారులు

రైతు రుణమాఫీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయనుండడంతో జిల్లాలో బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులెందరో లెక్కలు తీస్తున్నారు. అసలు, వడ్డీ లెక్కలను వేర్వేరుగా తీస్తున్నారు. ప్రభుత్వం ఈ వివరాలను బ్యాంకర్ల ద్వారా వివరాలను సేకరిస్తోంది. మొత్తం 1.50వేల మంది రైతులు ఉండే అవకాశం ఉంది. అయితే, గత ప్రభుత్వం 2014 ఏప్రిల్ నుంచి 2018 డిసెంబర్ 11వ తేదీ వరకు రుణాలు పొందిన రైతులకు రుణ మాఫీని వర్తింపజేసింది. అదికూడా లక్షలోపే. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేయాలనే ఆలోచన చేస్తుండడంతో కటాఫ్ తేదీని ఏ సంవత్సరం వరకు తీసుకుంటారనే దానిపై ఇంకా నిర్ణయానికి రా లేదు. త్వరలోనే దీనిపై మార్గదర్శకాలు వచ్చే సూచనలు ఉన్నాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు మంచి రోజులు



రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయడానికి ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వాలు ఆలోచించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రాగానే ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రుణమాఫీకి చర్యలు తీసుకుంటోంది. కాంగ్రెస్ హయాంలో రైతులకు మంచి రోజులు వచ్చినట్లే. – గొడిశరం భూమేశ్ రెడ్డి, కాంగ్రెస్ డొంకేశ్వర్ మండలాధ్యక్షుడు

తాగునీటి సమస్య తలెత్తవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- పకడ్బందీగా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం తాగునీటి సరఫరా తీరుతెన్నులపై కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి వారం రోజుల్లోగా సమగ్ర నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రజాపాలన సభల సందర్భంగా పలుచోట్ల మిషన్ భగీరథ జలాలు ఇంటింటికీ సరఫరా కావడం లేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెచ్చారన్నారు. ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రతి ఇంటికి శుద్ధి జలాలు అందేలా నీటిసరఫరా వ్యవస్థను చక్కదిద్దాలని సూచించారు. ముఖ్యంగా అంతర్గత సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎక్కడైనా లోపాలను గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేయాలని ఆదేశించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులను సంప్రదించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు కూడా సమృద్ధిగా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రాజేంద్రకుమార్, ఈఈలు రాకేశ్, నరేశ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'ఐడీ' కావాలంటే.. చేయి తడపాల్సిందే!

- జిల్లా ఖజానాశాఖలో ఉద్యోగుల చేతివాటం
- పూర్వ వీఆర్‌ఏల నుంచి రూ. 2వేల చొప్పున వసూలు
- ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు



సుభాష్‌నగర్: రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకులను(వీఆర్‌ఏ) పలు శాఖల్లో సర్దుబాటు చేసినా.. వారికి ఎంప్లాయిూ ఐడీలు ఇచ్చేందుకు ట్రెజరీ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఎంప్లాయిూ ఐడీలు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయంతెలిసిందే. వీరికి ఎంప్లాయిూ ఐడీలు ట్రెజరీశాఖ నుంచి ఇవ్వాల్సి ఉంటుంది. ఐదునెలలుగా జీతాలు లేక ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్న పూర్వ వీఆర్‌ఏల నుంచి వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో ఉద్యోగి నుంచి రూ. 2వేల వరకు డిమాండ్ చేసి తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. చేయి తడపకుంటే ఎంప్లాయిూ ఐడీ ఇచ్చేందుకు కొర్రీలు పెడుతుండడంపై పూర్వ వీఆర్‌ఏలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని 1643 మంది వీఆర్‌ఏలు ఉన్నారు. అందులో 201 మందిని వేరే జిల్లాలకు బదిలీ చేశారు. మరో 420 మంది వారసత్వ ఉద్యోగాల విషయంలో స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడంతో వారు రెవెన్యూశాఖలోనే కొనసాగుతున్నారు. మిగతా 1022 మందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేశారు. విద్యార్హత ఆధారంగా జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ ఇతర హోదాల్లో నియమించారు. వీరికి గతేడాది ఆగస్టు నుంచి గత ప్రభుత్వం జీతాలు చెల్లించలేదు. పలుమార్లు కలెక్టర్లు, మంత్రులు, ముఖ్యమంత్రినిసైతం విన్నవించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డి రెవెన్యూశాఖపై పలుమార్లు సమీక్ష నిర్వహించారు. ఎంప్లాయిూ ఐడీలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

రూ. 20 లక్షల వరకు..

జిల్లాలోని వివిధశాఖల్లో సుమారు 1022 మంది పూర్వ వీఆర్‌ఏలు వివిధశాఖల్లో ఐదు నెలలుగా ఉద్యోగాలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ఎంప్లాయిూ ఐడీలు తీసుకునేందుకు జిల్లా ఖజానాశాఖలో సంప్రదిస్తున్నారు. ఇదే ఆసరాగా చేసుకున్న ఆ శాఖ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో ఎంప్లాయిూ ఐడీ ఇచ్చేందుకు రూ. 2వేల వరకు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ లెక్కన సుమారు రూ. 20 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలామంది రూ. 2వేల చొప్పున చెల్లించినట్లు తెలిసింది.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

పూర్వ వీఆర్‌ఏలకు ఐదు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇతర జిల్లాలు, మండలాలకు బదిలీపై వెళ్లిన వారు అద్దెలు, ఇంటి ఖర్చులు, విద్య, వైద్యం కోసం అప్పులు చేశారు. ఈ క్రమంలో జిల్లా ఖజానాశాఖ ఉద్యోగులు ఎంప్లాయిూ ఐడీ కోసం రూ. 2వేలు వసూలు చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇంత మొత్తంలో డిమాండ్ చేస్తే.. నాలుగు నెలల సప్లిమెంటరీ జీతంతోపాటు ప్రస్తుత నెల జీతం తయారు చేసేందుకు ఇంకెంత అడుగుతారోనని వారు ఆందోళన చెందుతున్నారు. దాదాపు రూ. 10వేల వరకు డిమాండ్ చేస్తారని కూడా చర్చ జరుగుతోంది.

నా దృష్టికి రాలేదు

పూర్వ వీఆర్‌ఏల నుంచి ఎంప్లాయిూ ఐడీల కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి రాలేదు. ఎవరైనా వసూలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే సదరు ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఐడీ కోసం ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరంలేదు. – దశరథ్, డీడీ, ట్రెజరీశాఖ

ఉత్కంఠగా కబడ్డీ టోర్నీ

- 'తెలంగాణ'కు కలిసొచ్చిన అదృష్టం
- ఛత్తీస్‌గఢ్ డిస్‌క్వాలిఫైతో క్వార్టర్స్‌కు చేరిన జట్టు
- సెమీ ఫైనల్‌లో తప్పని ఓటమి
- నేడు కర్ణాటక, హర్యానాల మధ్య ఫైనల్



టోర్నమెంట్‌లో తలపడుతున్న హిమాచల్‌ప్రదేశ్ - తెలంగాణ జట్లు

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జాతీయ స్థాయి అండర్ –17 కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. బుధవారం క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. పోటీలను చూసేందుకు భారీగా ప్రేక్షకులు తరలివచ్చారు. తమ ఈలలతో ఆటగాళ్లను ప్రోత్సహించారు. తన సోదరుడు, తెలంగాణ అమరవీరుడు కరీం జ్ఞాపకార్థం టోర్నీలో బోనస్ పాయింట్లు సాధించిన ఆటగాళ్ల అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని అతడి సోదరుడు బాబా ప్రకటించారు.

ప్రీ క్వార్టర్స్‌లో ఓడినా..

నాకౌట్ మ్యాచ్‌లు మంగళవారం రాత్రే ప్రారంభమయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 34– 27 పాయింట్లతో ఓడిపోయింది. అయితే ఒక ప్లేయర్‌కు బదులుగా మరొక ప్లేయర్‌ను ఆడించడంతో తెలంగాణ జట్టు నిరసన తెలిపింది. దీంతో రిఫరీలు ఛత్తీస్‌గఢ్ జట్టును డిస్‌క్వాలిఫై చేశారు. ఇలా అదృష్టం కలిసి వచ్చి తెలంగాణ జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది.

క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు..

హర్యానా –మహారాష్ట్ర జట్ల మధ్య మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో హర్యానా జట్టు 7 పాయింట్ల ఆధిక్యంతో మహారాష్ట్రపై గెలిచి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. విద్యాభారతి జట్టుపై కర్ణాటక 21 పాయింట్లతో నెగ్గి సెమీస్ చేరింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ఉత్తరప్రదేశ్‌ను 2 పాయింట్ల స్వల్ప తేడాతో ఓడించి సెమీ ఫైనల్‌లోకి ప్రవేశించింది. నాలుగో మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 7 పాయింట్ల తేడాతో హిమాచల్‌ప్రదేశ్‌ను ఓడించి సెమీస్‌లో స్థానం ఖరారు చేసుకుంది. రిఫరీల తీరుతో మ్యాచ్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ హిమాచల్‌ప్రదేశ్ జట్టు సభ్యులు, వారి మేనేజర్, కోచ్‌లు నిరసన తెలిపారు. రిఫరీల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

సెమీ ఫైనల్స్..

కర్ణాటక– ఢిల్లీ జట్ల మధ్య మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. కూతకూతకూ ఉత్కంఠ నెలకొన్న ఈ మ్యాచ్‌లో చివరికి కర్ణాటక జట్టు ఢిల్లీపై 50 – 43 తేడాతో గెలిచి ఫైనల్ చేరింది. ఈ ఆటలో తమకు అన్యాయం జరిగిందని ఢిల్లీ క్రీడాకారులు కోర్టులోనే కూర్చుని కాసేపు నిరసన తెలిపారు. రిఫరీల వార్నింగ్‌తో వారు వెనక్కి తగ్గారు.

మరో మ్యాచ్‌లో తెలంగాణ – హర్యానా జట్లు తలపడ్డాయి. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు మూడుసార్లు ఆల్ అవుట్ అయ్యింది. హర్యానా 59 – 30 పాయింట్ల తేడాతో తెలంగాణ జట్టును ఓడించి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది.

తుదిదశకు టోర్నీ..

జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ తుది దశకు చేరుకుంది. గురువారం ఉదయం 11 గంటలకు కర్ణాటక – హర్యానా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మ్యాచ్ నిర్వహణ కోసం ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రేక్షకులు భారీగా తరలివచ్చే అవకాశాలు ఉండడంతో బారికేడ్లను ఏర్పాటు చేయడంతోపాటు పోలీస్ భద్రత కల్పిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బహుమతుల ప్రదానంతోపాటు టోర్నీ ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథ మ చికిత్స మాత్రమే చేయాలని డీఎంహెచ్‌వో సుదర్శనం అన్నారు. 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలపై ఆయన స్పందించారు. బుధవారం తన ఛాంబర్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీ నాయకులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఇంజెక్షన్లు ఇవ్వడం, సెలైన్‌లు పెట్టడం చేయొద్దన్నారు. ఎవరైన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, డెమో ఇన్‌చార్జి గంగాధర్, డీహెచ్‌సీ వెంకటేశ్, డీహెచ్‌ఈ రమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

గోప్యంగా సమీక్ష నిర్వహించడంపై అనుమానాలు

జిల్లాలో మూడు వేల ఆర్‌ఎంపీ, పీఎంపీలున్నారు. కానీ ఇద్దరు ముగ్గురు నాయకులనే పిలిచి తూతూమంత్రంగా సమావేశం పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూనియన్‌లో ఏళ్లుగా పాతుకుపోయిన నాయకులు అధికారులకు కమీషన్లు ఇస్తూ పీఎంపీలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలున్నాయి.

అర్సపల్లిలో పీఎంపీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

నగరంలోని అర్సపల్లిలో శ్రీనివాస్ అనే పీఎంపీ నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లో ప్రాక్టీసు చేయడంతో బుధవారం వైద్యాధికారులు సీజ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనా ఆధ్వర్యంలో తనిఖీలు చేసి, సీజ్ చేశారు. డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంగాధర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి కొత్తూరి గంగాధర్ పీహెచ్‌డీ సాధించారు. తెయూ అధ్యాపకుడు బాలకిషన్ పర్యవేక్షణలో 'సింథసిస్ అండ్ బైలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ ట్రైజోల్, టెట్రాజోల్ అండ్ థైజోల్ అనలోగ్స్ యాస్ ఆంటీ మైక్రో మైక్రోబియల్ ఏజెంట్స్' అనే అంశంపై గంగాధర్ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని బుధవారం సమర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిలు, సంపత్ కుమార్, మహమ్మద్ అబ్దుల్ ఖవి, మహేందర్, రాజేశ్వరి, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు చలాన్ల చెల్లింపు గడువు పొడిగింపు

ఖలీల్‌వాడి: వాహనాల జరిమానాల చెల్లింపు గడువును ప్రభుత్వం ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఏసీపీ నారాయణ బుధవారం తెలిపారు. వాహనాదారులు తమ వాహనాలపై ఉన్న జరిమానాలను వెంటనే చెల్లించాలని కోరారు. చలాన్లు ఉన్న వాహనాదారులు తప్పకుండా రాయితీని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

బీఆర్‌ఎస్‌వి దొంగ నాటకాలు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



ఖలీల్‌వాడి: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వడంలో తాత్సారం చేసి ఇప్పుడు ధర్నాలకు పిలుపునివ్వడం సరైంది కాదని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బుధవారం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్న హామీతోనే ప్రజా పాలనలో దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ చేసిన డొల్లతనం ఎక్కడ బయటకు రాకుండా ఉండేదందకు ధర్నాల పేరిట నాటకాలు ఆడుతుందన్నారు. ప్రజలు, లబ్ధిదారులు ఆందోళన పడవద్దని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్మిషన్ నిరాకరిస్తే చర్యలు

- హెచ్‌ఎంలను హెచ్చరించిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్
- జిల్లా వ్యాప్తంగా 3,072 మంది దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు
- సదరం, వైద్యుడి సిఫార్సు లేఖ ఉంటే హాజరులో సైతం మినహాయింపు



ఆర్మూర్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఏడాది కాలంలో ఎప్పుడు పాఠశాలలో చేరడానికి వచ్చినా రైట్స్ ఆఫ్ పర్సన్ విత్ డిజేబిలిటీ యాక్ట్–2016ను అనుసరించి అడ్మిషన్ తీసుకోవాలని జిల్లా, మండల విద్యాధికారులకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ ఎక్స్ అఫిషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎవరైనా హెచ్‌ఎంలు వీరిని పాఠశాలలో చేర్చుకోవడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఉత్తర్వుల సారాంశాన్ని రాష్ట్ర వ్యాప్తంగా డీఈవోలు, ఎంఈవోలు, జిల్లా ఐఈ కోఆర్డినేటర్లు, ఐఈఆర్పీలకు జూమ్ మీటింగ్ ద్వారా ఏఎస్‌పీడీ రమేశ్ ఇటీవల వివరించారు. గుర్తించిన 21 వైకల్యాలతో బాధపడుతున్న ఆరు నుంచి 18 ఏళ్ల పిల్లలను ఎలాంటి వివక్ష లేకుండా ఇతరులతో సమానంగా విద్య, క్రీడలు, వినోద కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. గత విద్యా సంవత్సరాలకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకున్నప్పటికీ ఆధార్ కార్డులో వారి వయస్సు, ఐక్యూను బట్టి తరగతిని కేటాయించాలన్నారు. ఈ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా సూచిస్తూ హోంబేస్డ్ ఎడ్యుకేషన్, భవిత లేక ఇతర ఏదైనా కేంద్రంలో ఉంటే ఆ వివరాలు నమోదు చేయాలని సూచించారు. దివ్యాంగులకు హాజరులో సైతం మినహాయింపు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ లేదా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడి సిఫార్సును హాజరు మినహాయింపునకు వినియోగించుకోవాలన్నారు.

ఐఈఆర్పీలతో ప్రత్యేక సర్వే

సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో 49 మంది ఐఈఆర్పీలు ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తూ బుధవారం నాటికి జిల్లాలో 3,072 మంది బడీడు దివ్యాంగులను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో చేర్పించినట్లు చెప్పారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

హెచ్‌ఎంలపై ఫిర్యాదులు వచ్చాయి



దివ్యాంగ విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోకపోవడంపై జిల్లాలోని పలువురు హెచ్‌ఎంలపై ఫిర్యాదులు వచ్చాయి. అడ్మిషన్ల విషయంలో ప్రధానోపాధ్యాయులు ఖచ్చితంగా నిబంధనలు పాటించి పాఠశాలల్లో చేర్చుకోవాలి. దివ్యాంగులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయవద్దు.

– దుర్గా ప్రసాద్, డీఈవో, నిజామాబాద్

అడ్మిషన్ నిరాకరిస్తే..



దివ్యాంగులకు హాజరు, ఉత్తీర్ణత విషయంలో అభ్యంతరాలు చెబుతూ పాఠశాలలో అడ్మిషన్ నిరాకరించడం వల్ల వారు బడి బయటి పిల్లలుగా మిగిలిపోతారు. వీరిపై వివక్ష చూపకుండా పాఠశాలలో చేర్చుకొని రికార్డుల్లో నమోదు చేయాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీనివాస్‌రావు, జిల్లా ఐఈ కోఆర్డినేటర్, నిజామాబాద్

పూర్తి భత్యం చెల్లించాలి

- అసెంబ్లీ ఎన్నికల్లో శ్రమ దోపిడీ చేశారంటున్న వీడియోగ్రాఫర్లు
- పట్టించుకోని అధికారులు



వినతిపత్రం అందిస్తున్న వీడియోగ్రాఫర్లు

మోర్తాడ్: ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో నిఘా బృందాల పనితీరును వీడియో తీసిన తమకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో భత్యం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని వీడియోగ్రాఫర్లు ఆందోళన చేపట్టారు. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో ఒక్కో వీడియోగ్రాఫర్‌కు రోజుకు రూ.1,500 చొప్పున భత్యం చెల్లించింది. ఈసారి కొంత అదనంగానే భత్యం చెల్లించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలతో పాటు బాన్సువాడలోని మండలాల్లోను నిఘా బృందాలకు అనుబంధంగా వీడియోగ్రాఫర్లు తమ విధులు నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గంలో సుమారు 25 మంది వీడియోగ్రాఫర్లు పని చేశారు. ఎన్నికలు ముగిసి 40 రోజులు గడచినా పూర్తిస్థాయిలో భత్యం చెల్లించకపోవడంపై వీడియోగ్రాఫర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వీడియోగ్రాఫరుకు రోజుకు రూ.600 చొప్పున భత్యం చెల్లించారు. గతంలో కంటే రూ.900లు తక్కువ చెల్లించడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. తమలో కొందరికి సొంతంగా వీడియో పరికరాలు లేకపోతే రోజుకు రూ.500 చొప్పున అద్దెకు తీసుకుని వాటితో వీడియో చిత్రీకరణ పూర్తి చేసినట్లు వివరించారు. రోజుకు రూ.2వేల చొప్పున చెల్లిస్తారని ఆశతో ఉంటే ఎన్నికల అధికారులు మాత్రం రూ.600లతోనే సరిపెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ పరిధిలో లేదని..

తమకు భత్యం చెల్లించే విషయంలో న్యాయం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును స్వయంగా కలిస్తే ఎన్నికల అధికారులను కలవాలని వారిని అడిగితే ఆర్డీవో, తహసీల్దార్లను అడగలంటూ చెప్పారు. ఇలా ఏ అధికారి తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్ వర్సిటీ కళాశాలల చెస్ పోటీలు



చెస్‌పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో అంతర్ కళాశాలల చదరంగ (చెస్) పోటీలను తెలంగాణ వర్సిటీ క్రీడా విభాగాం డైరెక్టర్ బాలకిషన్ బుధవారం ప్రారంభించారు. పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెయూ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి 29వరకు తమిళనాడులోని భారతిదాసన్ యూనివర్సిటీ చెన్నైలో సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ చాంపియన్–2024 నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు తెయూ జట్టు తరఫున ఎం సందీప్, రాకేశ్, హనుమాన్ గుప్తా, సాయికుమార్, శివసాయి ఎంపికై నట్లు తెలిపారు. పోటీలకు తెయూ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత కన్వీనర్‌గా వ్యవహరిస్తారని బాలకిషన్ పేర్కొన్నారు.

నూతన సంఘాలను ఏర్పాటు చేయాలి

- డీఆర్‌డీవో చందర్‌నాయక్



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: ఇప్పటి వరకు మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లో సభ్యులుగా లేని వారిని, నిరుపేద మహిళలను గుర్తించి నూతనంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ ఆదేశించారు. మండల కేంద్రంలోని టీటీడీసీ లో బుధవారం నిర్వహించిన ఇందూరు జిల్లా మహిళా పరస్పర సహకార సమాఖ్య కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా వచ్చే రుణాలను ఉపయోగించుకుని మహిళా సంఘాల సభ్యులు వివిధ రకాల యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. చాలా తక్కువ ధ్రువీకరణ పత్రాలతో రుణ సదుపాయం పొందే అవకాశం మహిళా సంఘాల సభ్యులకు ఉంటుందన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా డీఆర్‌డీవో కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులకు నూతన యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ మధుసూదన్, సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వెంకట్, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, నీలిమ, సాయిలు, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎంలు రవికుమార్, సరోజిని, జిల్లా సమాఖ్య కార్యదర్శి వనిత, కోశాధికారి లక్ష్మీ, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి తెడ్డు నవ్య 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మెంట్రాజ్‌పల్లి పీఈటీ సురేశ్, యువకులు గంగాధర్, సాయిలు, సూరజ్, కిరణ్ నవ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ పోటీల్లో నవ్య పాల్గొంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ దీప్తివాణి, వనిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు లత, కోచ్ మౌనిక, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

మంత్రికి కాంట్రాక్టు అధ్యాపకుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్కను తెయూ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు అధ్యాపకులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెయూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్టు అధ్యాపకుల యూనియన్ నాయకులతో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

వయోవృద్ధురాలి పోషణ, సంరక్షణపై విచారణ



కమ్మర్‌పల్లి: కోనసముందర్ గ్రామానికి చెందిన వయో వృద్ధురాలు నల్ల గంగు పోషణ, సంరక్షణ కేసును ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్ బుధవారం విచారించారు. నల్ల గంగు తన పోషణ, సంరక్షణ విషయమై కొడుకుపై వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో కోనసముందర్ వెళ్లి గంగు, కొడుకు గల్ఫ్‌లో ఉండడంతో ఆయన భార్య శారదను పిలిచి మాట్లాడారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం గురించి తెలియజేశారు. తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత, వారిని పోషించాల్సిన బాధ్యత పిల్లలదేనని ఆర్డీవో స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్‌ఐ శరత్, సర్పంచ్ రూప, వార్డు సభ్యుడు రాజేందర్ ఉన్నారు.

మొరం తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు



రెంజల్: మండల శివారులో మొరం తవ్వకాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం తహసీల్, పీఎస్‌లకు కూత వేటు దూరంలో మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి 7 టిప్పర్లు, రెండు జేసీబీలను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రెంజల్‌లో నిర్మాణ దశలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలకు తహసీల్దార్ రాంచందర్ 20 టిప్పర్లను అనుమతి ఇచ్చినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. అంతకుమించి తరలించడంతో పాటు ప్రైవేట్‌కు అక్రమార్కులు మొరం అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ బిల్లు కూడా లేదన్నారు. స్థానిక అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

రెంజల్(బోధన్): కూతురి బారసాల ఫంక్షన్‌లో ఏర్పడిన చిన్న గొడవతో మనస్తాపం చెందిన ఓ తండ్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కూనేపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుద్ద సతీశ్(25) తన కూతురు బారసాల ఫంక్షన్‌లో తన తల్లితో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సతీశ్ గ్రామ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి జాలర్లతో వెతికించినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్పీకి గాయాలు



లింగంపేట: మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్ విజయ్‌కుమార్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. బుధవారం విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా లింగంపేట కట్టు కాలువ సమీపంలో అడవి పంది అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం ఢీకొన్నది. దీంతో ఆయన ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు.

నలుగురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ బుధవారం తెలపారు. కేసులో నిజామాబాద్ నగరానికి చెందిన ఇద్దరికి మూడు రోజులు, ధర్పల్లి మండలంకు చెందిన ఇద్దరికి ఎనిమిది రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదని చెప్పారు.

పందిమడుగులో ఘర్షణ

సిరికొండ: పందిమడుగు గ్రామంలో మంగళవారం రాత్రి భూమి విషయంలో ఘర్షణ జరిగినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. భాస్కర్, సమావేశాలు అనే వారిద్దరికి భూమి విషయంలో గొడవ జరుగగా భాస్కర్, సమాలుపై దాడి చేయడంతో వారికి గాయాలైనట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఏ తల్లి కన్న బిడ్డనో..

- ఏడాదిన్నర వయస్సులో కన్నవారికి దూరమై..
- వారం రోజులుగా బాలల సంరక్షణ విభాగంలో చిన్నారి



కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో లభించిన చిన్నారి (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఏ తల్లి కన్న బిడ్డనో.. ఏడాదిన్నర వయస్సులో కన్నవారికి దూరమై వారం రోజులుగా ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో ఉంది. కన్నవారి కోసం పరితపిస్తూ దీనంగా చూస్తోంది. గత గురువారం కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఓ చిన్నారిని గుర్తు తెలియని మహిళ వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. తోటి ప్రయాణికులు గమనించి రైల్వే పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఆ చిన్నారి నిజామాబాద్ బాలల సంరక్షణ విభాగం వద్ద ఉంది. అయితే ఆ పాప ఎవరు.. ఆమెను ఎవరు వదిలి వెళ్లారు.. ఎందుకు వదిలేశారు అనే విషయాలు ఇప్పటికీ అంతుపట్టడం లేదు. ఆమెను ఎక్కడి నుంచి, ఎవరు తీసుకుని వచ్చారు అనే విషయాలను తెలుసుకోవడానికి కామారెడ్డి రైల్వే పోలీసులు తీవ్రంగా విచారిస్తున్నారు. అకోలా రైలు కామారెడ్డికి రాగానే సదరు చిన్నారి రైలులోని మెట్లకు దగ్గరగా కూర్చుని ఏడుస్తుందని కొందరు చెప్పగా, ఓ వృద్ధురాలు రైలు దిగి పాపను ప్లాట్‌ఫాంపై వదిలి వెళ్లిందని మరి కొందరు చెప్పుకొచ్చారు. వాస్తవం ఏమిటనే దానిపై స్పష్టత రాలేదు. రైల్వే స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ దగ్గర మాత్రమే సీసీ కెమెరా ఉంది. ప్లాట్‌ఫాం పై జరిగే దృశ్యాలు అందులో కనబడవు. దీంతో పాపను కన్న తల్లే వదిలించుకుందా, లేక మరెవరైనా కావాలనే వదిలి వెళ్లారా అనేది తెలియలేదు. మహారాష్ట్రకు చెందిన చిన్నారి మాదిరిగా అనిపించడం తప్ప ఎలాంటి వివరాలు లేవు.

కేసు నమోదు చేసి విచారణ

బాలల సంరక్షణ ఉల్లంఘన, ఐపీసీ సెక్షన్ 317 కింద రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. రైల్వే స్టేషన్‌కు ఎవరైనా తీసుకువచ్చారా అనే కోణంలో మొదట విచారించారు. అందుకు ఏదైనా క్లూ దొరుకుతుందేమోనని మంగళవారం కామారెడ్డిలోని అన్ని కూడళ్లు, రైల్వే స్టేషన్ దారి గుండా ఉండే సీసీ కెమెరాలను అన్నింటినీ పరిశీలించారు. ఎలాంటి ఆధారం దొరకలేదు. దీంతో చిన్నారి రైలులోనే కామారెడ్డికి చేరినట్లు నిర్ధారణకు వచ్చారు. తదుపరి విచారణ నిమిత్తం రైల్వే పోలీసులు అకోలా నుంచి కామారెడ్డి వరకు ఉన్న అన్ని రైల్వే స్టేషన్‌లు, వాటి పరిసర ప్రాంతాల్లో ఉండే సీసీ ఫుటేజీలను పరిశీలించే పనిలో ఉన్నారు. ఇందు కోసం అకోలా, నాందేడ్, ముత్కేడ్, ఉమ్రి, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లలో సీసీ ఫుటేజీల పరిశీలన, విచారణ జరపాల్సి ఉంది. బుధవారం నుంచి ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో ఆయా స్టేషన్‌లలో విచారణ జరుపనున్నట్లు తెలిసింది. ఎలాగైనా కేసును చేధించి సదరు చిన్నారిని కన్నవారి చెంతకు చేర్చాలనీ, వాస్తవాలను వెలికి తీయాలని కామారెడ్డి రైల్వే పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

గాంధారి: ప్రేమ పేరుతో బాలికను గర్భవతిని చేసి మోసం చేసిన ఒకరి పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన గుర్రం రాజా అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలిక(17)ను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడు. బాలిక అనారోగ్యంతో బాధపడుతుంటే తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి చూయించగా పరీక్షించిన వైద్యులు గర్భవతి అని తెలిపారు. తల్లిదండ్రులు బాలికను విచారించగా రాజా అనే యువకుడు మోసం చేసినట్లు తెలిపింది. దీంతో బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదాశివనగర్ సీఐ రామన్ కేసు విచారణ చేపట్టి యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దేవునిపల్లిలో వ్యక్తి అదృశ్యం



కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన తృప్తి వెంకటేశ్ అనే 32 ఏళ్ల వ్యక్తి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేశ్ జిల్లా కేంద్రంలోని మణప్పురం గోల్డ్‌లోన్‌లో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఈనెల 8 న ఇంటి నుంచి వెళ్లిన అతడు ఇంటికి చేరుకోలేదు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తల్లి పద్మ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుంకినిలో..

బోధన్‌టౌన్: పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామానికి చెందిన తోకల గంగారాం అనే వ్యక్తి అదృశ్యమైనట్లు సీఐ వీరయ్య బుధవారం తెలిపారు. నాగరాజు కూలి పనినిమిత్తం 15 రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడని, కల్లు తాగే అలవాటు ఉన్న గంగారాంకు అక్కడ దొరకక పోవడంతో మతిస్థిమితం కోల్పోయిన ట్లు పేర్కొన్నారు. ఈ నెల 1న హైదరాబాద్ నుంచి బోధన్‌కు వచ్చినట్లు చెప్పగా కుటుంబీకులు అక్కడికి వెళ్లే సరికి అతను అదృశ్యమ య్యాడు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గొలుసు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్

డిచ్‌పల్లి: మహిళల మెడల్లో నుంచి బంగారు గొలుసుల దొంగతనాలకు అలవాటు పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ ఏసీపీ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. హర్యానా రాష్ట్రానికి చెందిన ఇద్దరు నేరస్తులు సాహిల్ ఖాన్ (కంటైనర్ డ్రైవర్), మహమ్మద్ అర్షద్ (జేసీబీ డ్రైవర్)లు గొలుసు దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఈ నెల 4న నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వెంకటేశ్వర కాలనీ బస్టాండ్ వద్ద చౌకి సువర్ణతో నిందితులు అడ్రస్ అడిగే నెపంతో ఆమె మెడలో ఉన్న 2 తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని పారిపోయారు. సువర్ణ కొడుకు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గన్యా తండా వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై తిరుపతి, సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. వీరి నుంచి 2 తులాల బంగారు గొలుసు, 2 రోల్డ్ గోల్డ్ చైన్‌లు, 2 సెల్ ఫోన్లు, యమహా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాహిల్ ఖాన్ ఇదివరకు సల్మాన్ అనే వ్యక్తితో కలిసి నేరాలకు పాల్పడడంతో జైలుకు వెళ్లి వచ్చాడు. సాహిల్‌పై ఆరు కేసులు, మహమ్మద్ అర్షద్‌పై నాలుగు కేసులు ఉన్నాయి. నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి సీఐ కృష్ణ, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ కేయూపీవీ ప్రసాద్, రాజేశ్వర్, కానిస్టేబుళ్లు భూపతి, భూమేశ్, సతీశ్, రాము, సర్దార్, రాములు కేసును త్వరగా చేధించారు. వీరిని సీపీ కల్మేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

బంగారం చోరీ కేసులో డిచ్‌పల్లి పీఎస్ నుంచి తప్పించుకున్న నిందితుడిని పోలీసులు మంగళవారం రాత్రి నిర్మల్ ప్రాంతంలో పట్టుకున్నారు. ఈ నెల 4న జక్రాన్‌పల్లి, అర్గుల్‌లో జరిగిన బంగారు గొలుసు దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను ఈ నెల 9న అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు కాలకృత్యాల కోసం నిందితుడు సాహిల్‌ఖాన్ బయటకు రాగా తప్పించుకున్నాడు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో నిర్మల్ టోల్‌ప్లాజా వద్ద ముప్కాల్ పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో నిందితుడు దొరికాడు. వెంటనే అతడిని డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. అయితే ఇదంతా రిమాండ్ రిపోర్టులో చూపకుండా మంగళవారం రాత్రి ఇద్దరు నిందితులను పట్టుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చూపడం గమనార్హం.